www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 2 సెప్టెంబర్ 2024
5
వైఎస్ఆర్

వర్షపు నీటిని తొలగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల కడప నగరంలో లోతట్టు ప్రాంతాల వద్ద నిలిచిన నీరు వెంటనే తొలగించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వై. నందన్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను డ్రోన్ ద్వారా పరిశీలన చేయిస్తూ ఆ ప్రాంతంలో నీరు నిలువ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నీరు నిలువ ఉండడంతో రీజనల్ మేనేజర్తో కలిసి ఆర్టీసీ బస్టాండ్ పరిశీలించారు. కడప నగర్ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. కొర్రైలాగులా కురుస్తున్న వర్షానికి నగరంలో ఎక్కడైనా నీరు నిలువ ఉంటే తక్షణమే తగు చర్యలు తీసుకోవాల్సిందిగా శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగా అధికారులను ఆదేశించారు.

సా..గుతున్న ఖరీఫ్..!

- ముగింపులోనూ ఊగిసలాటే
- కడపలో 45.51 శాతం సాగు
- అన్నమయ్యలో 28 శాతం

ఖరీఫ్ సీజన్ ముగింపు దశలోనే ఊగిసలాటే కనిపిస్తోంది. జూన్ ప్రారంభంలో అధిక వర్షపాతం నమోదవడంతో ఆశలు రేకెత్తించింది. నాలుగో వారం నుంచి జులై, ఆగస్టు చివరి వరకు వర్షపాతం మందగించడంతో సాగు ఆశించిన రీతిలో సాగలేదు. ఆగస్టులో కెసి కెనాల్కు నీటిని విడుదల చేయడంతో ఆశావహంగా సాగుతోందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి రోజు సాయంత్రానికి ఆకాశం కారు మబ్బులతో ఆశలు రేకెత్తించడం, చివరకు ఉసూరుమనిపించడం పరిపాటిగా మారింది. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లో కడప జిల్లాలో 45.51 శాతం, అన్నమయ్యలో 28 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో విత్తనం పడాల్సి ఉంది. ఇటువంటి విభిన్న పరిస్థితుల నేపథ్యంలో మేఘుడు దోబూచులాడుతున్నాడు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ మందగమనంలో సాగుతోంది. కడప జిల్లాలో 1,85,716 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,61,612 ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగు చేయాలనేది వ్యవసాయ శాఖల లక్ష్యం. కడప జిల్లాలో జూన్, జులై, ఆగస్టు మాసాల్లో నుంచి 84,528 ఎకరాల్లోనే విత్తనం పడింది. 36.11 శాతం, అన్నమయ్య జిల్లాలో 28,403 ఎకరాల్లోనే విత్తనం పడింది. కడప జిల్లాలో 45.51 శాతం, అన్నమయ్య జిల్లాలో 28 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఉభయ జిల్లాల్లో మిగిలిన పొలమంతా బీడుగా దర్శనమిస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఉభయ జిల్లాల రైతాంగం సాగుకు సన్నద్ధమైంది. పొలంలో విత్తనం విత్తడానికి అన్ని విధాలుగా సిద్ధమైన తరుణంలో మేఘం ముఖం చాటేయడం నిరుత్సాహాన్ని కలిగించింది. కడప జిల్లాలో ప్రధాన పంట వరి పంట 76,992 ఎకరాలకు గాను 24,418 ఎకరాలు, వేరుశనగ పంట 14,748 ఎకరాల్లో సాగుకుగాను 6,792 ఎకరాలు, మినుములు 6,525 ఎకరాల సాగు లక్ష్యాన్ని అధిగమించి 16,603 ఎకరాలు, కంది 9,618 ఎకరాలకు గాను 7,643 ఎకరాలు, పత్తి 24,086 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 19,646 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్ మొదలు నుంచి నేటి వరకు 44,046 ఎకరాల్లోనే విత్తనం పడింది. జిల్లాలో 28 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జిల్లా ప్రధాన పంట వేరుశనగ. జిల్లాలో 1,18,275 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 1,05,844 ఎకరాల్లో విత్తనం పడింది. వరి 24,077 ఎకరాల్లో విత్తనం పడాల్సి ఉండగా 11,124 ఎకరాల్లో విత్తనం పడింది. ఈలెక్కన 28 శాతం విస్తీర్ణంలో విత్తనం పడింది. మిగిలిన పొలమంతా బీళ్లుగానే దర్శనమిస్తోంది.

వెంటాడిన వర్షాభావం

జులై, ఆగస్టు మాసాలను వర్షాభావం వెంటాడింది. 96.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 37.8 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు కొనసాగుతోంది. కడప జిల్లాలో ఖరీఫ్ మందగమనంలోనే కొనసాగుతోంది. ఒక నెలలో కురవాల్సిన వర్షపాతాన్ని, రెండు, మూడు రోజుల్లో కురవడం తరువాత ముఖం చాటేయడంతో దుక్కులు చదును చేసుకోవడానికి సరిపోతోంది. విత్తనం వేయడానికి మరో పదును పాటు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఫలితంగా సాగు నత్తనడకన సాగుతోంది. అన్నమయ్య జిల్లాలోని 16 మండలాలు మినహా మిగిలిన మండలాల్లో ఖరీఫ్ కలిసి ఉన్నాయి. మరో 10 మండలాలు సాధారణ వర్షపాతాన్ని కొనసాగిస్తుండడం గమనార్హం. మిగి లిన నాలుగు మండలాల్లో లోటువర్షపాతం కొనసాగుతోంది. రైల్వేకోడూరు, మదనపల్లి ప్రాంతాలు మినహాయిస్తే మిగిలిన మండలాలన్నీ మెట్టప్రాంతాలు కావడంతో వేరుశనగ సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. వేరుశనగ సాగు ఆశాజనకంగా సాగు కావడం గమనార్హం. అన్నమయ్య జిల్లా భిన్నమైన భౌగోళిక వాతావరణ పరిస్థితులను కలిగి ఉన్న నేపథ్యంలో వేరుశనగ ఆశా వహంగా సాగు కావడం గమనార్హం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో కురిసిన అరకొర వర్షానికి వేరుశనగ సాగుకు వాతావరణం అనుకూలించడంతో అంతంత మాత్రమే పంటల సాగు విస్తీర్ణం కనిపిస్తోందని చెప్పవచ్చు.

లక్ష్యాన్ని అధిగమిస్తాం

కడప జిల్లా ప్రత్యేక పరిస్థితులను కలిగి ఉంది. ఇప్పుడిప్పుడే సాగు పూర్తిస్థాయిలో ఊపందుకుంది. ఇదేతరహాలో ముందుకు సాగుతూ, సెప్టెంబర్ నాటికి ఖచ్చితంగా నిర్దేశిత లక్ష్యాన్ని అందు కుంటాం.

- ఎ.నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, కడప.

మంచిరోజులొస్తాయి.. భయపడొద్దు

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్రెడ్డి

మహిళ సమస్యలు వింటున్న వై.ఎస్. జగన్మోహన్రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మంచి రోజులొస్తాయి.. ఎవరూ భయపడొద్దు.. కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ కలిసిన వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మనం చేసిన మంచి ఉందని, మనపట్ల ప్రజలకు విశ్వాసం ఉంది, మళ్లీ ప్రజల్లోకి వస్తామని, భవిష్యత్ మనదే అని వైసిపి శ్రేణులకు జగన్ ధైర్యం చెప్పారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ నాయకులతో చర్చించారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. రాబోయే కాలంలో ప్రతి కార్యకర్తకూ తనతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసానిచ్చారు. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అను గుణంగా అడుగులు వేయాలని శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కొంతమంది కార్యకర్తలు, అభిమానులు వారి ఆరోగ్య, నిరుద్యోగ సమస్యలను వై.ఎస్. జగన్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందిస్తూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీ అవినాష్ రెడ్డికి సూచించారు. పట్టణంలోని క్రీడాకారులు వారి సమస్యలను ఆయనకు వివరించడంతో క్రీడల్లో బాగా రాణించి పులివెందులకు, మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మీకు ఎప్పుడూ అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు.

ఆప్యాయంగా పలకరింపు..

జగన్ కలిసేందుకు జిల్లాలోని నలంలో నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినుతులను స్వీకరించారు. పులివెందులకు భారీగా తరలివచ్చిన వైసిపి నాయ కులను ఓపికతో పలకరించి సమస్యలు తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా పులివెందులలోని క్యాంపు కార్యాలయం ప్రజలతో కిక్కిరిసిపోయింది.

జిల్లా రాజకీయాలపై ఆరా..

వైసిపి ముఖ్య నాయకులతో జిల్లా రాజకీయాలపై ఆరా తీసినట్లు తెలుస్తుంది. జిల్లా పరిషత్ చైర్మన్ పదవీ చేజారకుండా ఉండేందుకు ముఖ్య నేతలకు దిశ దశ నిర్దేశించినట్లు సమాచారం. ఎవరైనా జడ్పిటిసిలు అసంతృప్తిగా ఉంటే తమ దగ్గరికి తీసుకురావాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక జరిగేంతవరకు వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా పరిషత్ పీఠాన్ని చేజారకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా నాయకులను ఉంటుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని నాయ కులతో అన్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, రాజం పేట ఎమ్మెల్యే ఆకెపాటి అమ్మనాథరెడ్డి, మాజీ శాసన సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్ మనోహర్ రెడ్డి, జిల్లా, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు రావచ్చుననే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు, ఎయిడెడ్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించామని పేర్కొన్నారు..ఈ ఉత్తర్వులను సంభందిత యాజమాన్యాలన్ని విధిగా పాటించాలని ఆ ప్రకటనలో కలెక్టర్ ఆదేశించారు.

ఇడుపులపాయలో షర్మిల బస

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గెస్ట్ హౌస్లో పిసిసి చీఫ్ షర్మిల బస చేశారు. కీ.శే. వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని హైదరాబాద్ నుండి రోడ్డు మార్గనా తన తల్లి విజయమ్మతో కలిసి ఆదివారం రాత్రి 8.40 గంటలకు ఇడుపులపాయకు చేరుకున్నారు. సోమవారం వైఎస్ రాజశేఖర్రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా వైఎస్ఆర్ ఘాట్ వద్ద 8 గంటలకు నివాళులర్పిస్తారు. వైఎస్ఆర్ ఘాట్ కు నివాళులర్పించిన అనంతరం కడపకు వెళ్లి కడప కలెక్టర్ను కలిసి తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పార్టీ పటిష్టతపై చర్చించనున్నారు. ఇడుపులపాయి నుంచి షర్మిల కడపకు వెళ్లిన తర్వాత పులివెందులలో ఉన్న మాజీ సిఎం జగన్ రెడ్డి ఇడుపులపాయికి వచ్చి తన తండ్రి వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించనున్నారు. వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులు ఆర్పించేందుకు షర్మిలా, మాజీ సిఎం జగన్ రెడ్డి వస్తుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుండెపోటుతో ఎపిజిబి మేనేజర్ మృతి

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ పత్తి. సత్యనారాయణ (60) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన రోజు మాదిరిగానే విధులు నిర్వహించుకుని బద్వేల్కు పయనమయ్యారు. పోరుమామిళ్ల నుంచి బద్వేల్ బస్సు ఎక్కగానే మార్గమధ్యలో గుండెనొప్పి వచ్చింది. బద్వేల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లే సమయానికే ఆయన మృతిచెందారని వైద్యులు పేర్కొన్నారు. 9 నెలల్లో ఆయన ఉద్యోగ విరమణ అవతారని బంధువులు పేర్కొన్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మట్టి విగ్రహాలను ఏర్పాటు చేద్దాం

ప్రజాశక్తి-కడప అర్బన్ : వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుందామని మున్సిపల్ కమిషనర్ నందన్ పిలుపునిచ్చారు. ఆదివారం పర్యావరణ రక్షణకై మున్సిపల్ కార్మికుల తొలి అడుగు వేస్తూ మట్టి విగ్రహాల ఏర్పాటు చేసుకుందాంటూ అంటూ రూపొందించిన పోస్టర్లను కమిషనర్ ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. పాత మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ చంద్రం, హెల్త్ ఆఫీసర్, కార్మికులు కిరణ్ కుమార్, వెంకటేష్, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.

యుపిఎస్ అమలు వద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన యుపిఎస్, సిపిఎస్ వద్దని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్యోతి రామచంద్రబాబు, డాక్టర్ హరి కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల పాలిట సవతి తల్లి ప్రేమని చూపిస్తోందని వా పోయారు. సిపిఎస్ రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చి వెంటనే సిపిఎస్ తొలగిస్తూ ఒపిఎస్ను అమలుపరిచే విధానంలో కొన్ని రాష్ట్రాలు హామీలు నిల బెట్టుకోగా, మన రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వం ఇంకా దీని గురించి ఏ విధమైన ప్రకటన చేయకపోవడాన్ని ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా నిరసి స్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బిటిఎ నాయకులు పెంచలయ్య, జయరామ్, మధుసూధన్, సూర్య ప్రకాష్రావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కడప సిటీ : హ్యాండ్స్ ఫర్ యు స్వచ్చంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పట్టు పోగుల సుబ్బారావు ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథులుగా గోవిందు నాగరాజు, బిసి సంఘం కడప జిల్లా అధ్యక్షులు లింగమూర్తి హాజరై ప్రారంభించారు. జిల్లాలోని ప్రముఖ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది సుమారు 163 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రెడ్డయ్య యాదవ్, కళ్యా సుధాకర్, కొండయ్య , మడక చక్రధర్ ఓబుల్రెడ్డి, త్రివిక్రమ్, శ్రీనుయాదవ్ , పుల్లగూర విష్ణు, ఈశ్వరయ్య, బాలాజీ, విజయ్ మల్లియాదవ్, యువత పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - కడప : క్రీడల్లో ఉన్నత స్థాయిలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కడప జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. డేనియల్ ప్రదీప్ అన్నారు. ఆదివారం కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్లో జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మెన్ అండ్ ఉమెన్ జిల్లా జట్ల ఎంపి కలను నిర్వహించారు. ఎంపికలను అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డేనియల్ ప్రదీప్, కార్యదర్శి సుధీర్, ఉపాధ్యక్షులు థామస్ జీవన్ బాబు ప్రారంభించారు. ఎంపికల్లో జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎం. హరి ఫుట్బాల్ కోచ్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్ ఎం. హరి, కోచ్ ఎన్.వి. పి అమృత్ రాజ్, డేనియల్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలస్తీనాలో మారణకాండను ఆపాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసులరెడ్డి, బి. మనోహర్, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తుందని తెలిపారు. ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల దాదాపు ఇప్పటికీ 39,500 మంది పాలస్తినా పౌరులు మరణించారని, ఇందులో మహిళలు, చిన్నపిల్లలే 20వేల మంది పైగా ఉన్నారని పేర్కొన్నారు. అమెరికా ఆయుధ సంస్థల లాభాలకు మూడవ ప్రపంచ దేశాలలో నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. ముడి సరుకు రవాణాకు అంతరాయం కలగడంతో పరిశ్రమలు నడవక నిరుద్యోగం పెరుగుతుందని, మొత్తంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని పేర్కొన్నారు. బిజెపి మతోన్మాద పార్టీ అధికారంలోకి రాగానే భారత అలీన విదేశాంగ విధానానికి తిలోదకాలు ఇచ్చి గాజా ప్రజలపై జరిగే యుద్ధంలో ఇజ్రాయెల్ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేసి దేశప్రతిష్టను మంటగలుపుతుందని తెలిపారు. ఇందు కోసమే భారత డిఫెన్స్ సెక్టార్ను ప్రయివేటీకరణ చేసిందని పేర్కొన్నారు. అమెరికా, నాటో దేశాలు సిరియా, లిబియా, ఇరాక్ వంటి అనేక దేశాల్లో అంతర్యుద్ధాలను సమర్థిస్తూ ఆయుధాలు అందిస్తుందని తెలిపారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు చేతుల్లో పేలే ప్రతీ తూటా మేడిన్ అమెరికా నుంచి వస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ కార్మికవర్గం ఈ సామ్రాజ్యవాద యుద్ధాలను వ్యతిరేకించాలని, ప్రపంచ శాంతికై నిలబడాలన్నారు.

వర్షాలు పంటలకు ఉపయోగకరం : జెడి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో సాగు చేసిన తమ పంటలను బతికించుకోవాలని భావించిన రైతన్నలకు మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర రావు ఆదివారం తెలిపారు. కడప మండలంలో ఆయన విస్తృతంగా డ్రోన్ల సాయంతో పొలాలను పరిశీలించారు. జిల్లాలో ఎటువంటి పంట నష్టం జరగలేదని పేర్కొన్నారు. వర్షాధార పంటలైన వేరుశనగ, పత్తి, కంది పంటలు తేమ ఒత్తిడి నుంచి రక్షించబడతాయని తెలిపారు. రైతులు పై పంటల్లో ఎరువులను చల్లుకోవాలని పేర్కొన్నారు. వర్షాధార పంటలలో అనుబంధ నీటిపారుదలని నివారించవచ్చని తెలిపారు. రైతులు జొన్న విత్తనాలు వేసుకోవచ్చని పేర్కొన్నారు. రబీ పంటలైన శనగ, జొన్న కోసం సన్నాహక సాగు పద్ధతులు చేయవచ్చని తెలిపారు. వరి పంటలో నేల లవణీయత, పానికల్ మైట్ ప్రభావం తగ్గుతుందని పేర్కొన్నారు. అలసంద, ఆముదం, కంది వంటి పంటలను విత్తుకోవడానికి ఈ వర్షం బాగా ఉపయోగమని తెలిపారు.

పది వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి- గోపవరం : బద్వేల్ నియోజకవర్గంలోని బద్వేల్, గోపవరం, కలసపాడు పైలెట్ ప్రాజెక్టుగా లిట్రసి ఇండియా ట్రస్ట్, చెన్నై రాష్ట్రం వారి ఆర్థిక సాయంతో మమ్రే ఫౌండేషన్ ఆధ్వర్యంలో వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం బద్వేల్లోని ఫౌండేషన్ కార్యాలయంలో అర్బన్ సిఐ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు రాని వారు పడే ఇబ్బందులను వివరించారు. నిరక్షరాస్యుల కోసం ఇలాంటి వయోజన కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరూ కేంద్రాలకు వచ్చి చదువుకుని తమ జీవితాలను మార్చుకోవచ్చన్నారు. అనంతరం విద్యా బోధనకు అవసరమయ్యే పరికరాలు పుస్తకాలు, పలకలు, బలపాలు, ఛార్జింగ్ లైట్లు తదితర వస్తువులను ఉచితంగా అందజేశారు. అనంతరం ఎస్ఐని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిఎ జింకా శాంతమ్మ, వయోజన విద్య కేంద్రాల పది మంది ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు రాజు, చోటు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రస్తుతం నిర్వహిస్తున్న పని సర్దుబాటులో ఉర్దూ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఉర్దూ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాంశాలలో తెలుగు మీడియం స్కూల్ అసిస్టెంట్లు, ఎస్టిజిలతో భర్తీ చేయడం నిలిపి వేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సైపుల్ల, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి పేర్కొన్నారు. ఆదివారం వారు విజయవాడలోని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫారూఖ్ను కలిసి వినతి పత్రం అందజేశారు. కడప నగరపాలక ఉర్దూ ప్రాథమికోన్నత అగాడి, గౌస్నగర్ , బుచ్చర్ వీధి పాఠశాలలు, పలనాడు జిల్లా జానపాడు ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో, కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలంలోని ఉయ్యూరు వెస్ట్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో సత్యసాయి జిల్లాలోని ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు చిలమత్తూరు, లేపాక్షి, పెనుకొండ, మడకశిర లో తెలుగు మీడియం స్కూల్ అసిస్టెంట్లను, ఎస్జిటిలను సర్దుబాటు చేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మల్బరీ సాగుకు పెద్దపీట

ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం
కుటీర పరిశ్రమ తరహాలో సాగు చేయాలి
కడప జిల్లా పట్టు పరిశ్రమశాఖ ఎడి శ్రీనివాసులరెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మల్బరీ సాగుకు పెద్దపీట వేయాలి. తద్వారా అధిక ఆదాయం లభ్య మవుతుంది. కుటీర పరిశ్రమ తరహాగా భావించి సాగు చేస్తే మరింత ఆదాయం లభిస్తుంది. దీనికి సమర్థ యాజమాన్య పద్ధతులను జోడించాలి. దీనికితోడు ఇటీవలి నూతన రకపు వంగడాలతో పంటలను సాగు చేసుకోవాలి. ఆధునిక మార్కెటింగ్ సదుపాయం కారణంగా గణనీయంగా ఆదాయం లభిస్తోంది. సరు కును తూకం వేసిన వెంటనే పేమెంట్ చెల్లింపుల వ్యవస్థ ఏర్పాటైంది. స్వల్ప కాలిక పంటల తరహాలో 45 రోజు నుంచి 70 రోజుల వ్యవధిలో ఆదాయం లభిస్తోంది. తెగుళ్ల సోకే అవకాశం ఉండదు. వాణిజ్య పంటల తరహాలో లక్ష లాది రూపాయల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయే అవకాశం ఉండదని పేర్కొంటున్న కడప పట్టు పరిశ్రమలశాఖ ఎడి శ్రీనివాసులరెడ్డితో ప్రజాశక్తి ముఖా ముఖి...

మల్బరీ వివరాలు తెలపండి ?

జిల్లాలో 425 ఎకరాల్లో మల్బరీ సాగులో చేయాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సర ఆగష్టు నాటికి 135 ఎకరాల లక్ష్యానికిగానూ 90 ఎకరాల్లో సాగు చేయడమైంది. దీంతో 66.66 శాతం లక్ష్యాన్ని అందు కోవడమైంది. జిల్లావ్యాప్తంగా 350 మంది రైతులకు రూ.269 కోట్ల మేరకు ఆదాయం లభించింది.

మల్బరీ ఫామ్లెన్ని?

రెండు మల్బరీ ఫామ్స్ ఉన్నాయి. మైదుకూరు నియోజకవర్గంలోని వనిపెంట, కడప నగర సమీపంలోని ఊటుకూరు ప్రాంతాల్లో పెంచుతున్నాం. రెండు లక్షల మల్బరీ నారు మొక్కలను పెంచి రైతులకు సరస మైన ధరలకు అందుబాటులో ఉంచుతున్నాం. రూ.2 చొప్పున నర్సరీ మొక్కలను అందజేస్తాం.

ప్రోత్సాహకాల వివరాలు తెలపండి?

ఎకరా నారు మొక్కలకు రూ.30 వేల యూనిట్, షెడ్డు నిర్మాణానికి రూ.3.35 లక్షలు, ఎస్సి, ఎస్టిలకు నాలుగు లక్షలు కేటాయిస్తున్నాం. పరికరాలు, స్టాండు, ప్లాస్టిక్ తట్టలు, నేత్రికములు (చంద్రికలు) నిమిత్తం రూ.75,000 మంజూరవుతుంది. ఇందులో ఎస్సి, ఎస్టిలకు 90 శాతం, ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ అందజేస్తాం.

మల్బరీ విస్తరణ చర్యలేమిటి?

ఊటుకూరు, వనిపెంట ప్రాంతాల్లో మల్బరీ సాగు పట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ సబ్సిడీలు, సాగు లాభదా యకతను వివరించడం జరుగుతోంది. దీంతోపాటు వనిపెంటలో జాకీ పురుగుల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా అభ్యుదయ రైతులను ఆకర్షిస్తున్నాం. ఫలితంగా మల్బరీ సాగు విస్తీర్ణాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం.

గూళ్ల రకాలెన్ని, ఇన్సెంటివ్స్ వివరాలు?

బైఓల్టేన్, సి.పి రకాలు. తెల్లగూళ్లు, ఏప్రిల్, మే, జూన్లో సాగు చేసుకోవచ్చు. సిపి గూళ్లు. తెల్లగూళ్లకు మార్కెట్లో కిలో రూ.750, సిపి గూళ్లకు రూ.400 ఇన్సెంటివ్ కింద ఇచ్చే అవకాశం ఉంది. రైతులే గూళ్లను మార్కెట్కు తీసుకెళ్లి విక్రయించుకోవాలి. గూళ్ల కొనుగోలు అనంతరం నగదును చెక్కుల రూపంలో అందజేస్తారు.

మార్కెట్ల వివరాలు తెలపండి?

మదనపల్లి, కుప్పం, కదిరి, ధర్మవరం, పలమనేరు, హిందూపురం మార్కెట్లలో విక్రయించుకునే అవకాశం ఉంది. కర్నాటకలో రాంనగర్, సిద్దల గట్ట మార్కెట్లు అందు బాటులో ఉన్నాయి.

సాగు సీజన్ల గురించి చెప్పండి?

జూన్ నుంచి మార్చి వరకు మల్బరీని సాగు చేసుకోవచ్చు. సిబి రకం, బైవోల్ట్ రకం. సిబి రకం వేడి వాతావరణంలో సాగు చేసుకోవచ్చు. బైవోల్డ్ రకం వేసవిలో సాగు చేసుకోవాలి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు బైవోల్డ్ సీడ్, మార్చి నుంచి జూన్ వరకు సిబి రకం రకాలను సాగు చేసు కోవాలి.

మల్బరీ దశలను వివరించండి?

నాలుగు జరాలు, ఐదు దశలు ఉంటాయి. గుడ్డు నుంచి పురుగు బయటికి వచ్చేది మొదటి దశ, మూడు రోజుల తర్వాత జరానికి పోవడం జరుగుతుంది. 24 రోజుల్లో పురుగు రూపంలో లార్వా దశ వస్తుంది. ఆరు నుంచి ఎనిమిది రోజుల తరువాత గూడు కట్టుకోవడాన్ని పీపా దశ అం టారు. ఐదవ రోజు మార్కెట్ పోవడం జరుగుతుంది. ఐదో రోజు మార్కె ట్ తీసుకెళ్లి ఇ-యాక్షన్ ద్వారా రీలర్స్కు విక్రయించాలి. రేటు ఇష్టం లేకపోతే సెకెండ్, థర్డ్ యాక్షన్స్కు వెళ్లొచ్చు. విక్రయ అనంతరం గంట తర్వా త రైతు ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

షెడ్ల ఏర్పాటు, సంరక్షణ ఎలా ?

ఊరు బయట, పొలాల్లో షెడ్లు ఏర్పాటు చేయాలి. 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 35 అడుగుల పొడవు, 20 అడుగుల వెడ ల్పుతో షెడ్లు నిర్మించాల్సి ఉంది. యూనిట్ విలువ రూ.4.50 లక్షలు అయితే ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ, ఎస్సి, ఎస్టి 90 శాతం సబ్సిడీ ఇస్తా రు. రూ.3.60 లక్షలు వస్తుంది. షెడ్ల అడుగు భాగంలో న్యూస్ పేపర్ పరి చి షూట్ ఫీడింగ్ (కొమ్మలు వేయడం) చేయాలి. నేత్రికలు, చాకీ కట్టెలు ఏర్పాటు చేయాలి. సున్నం కొట్టడంతో క్రిమి కీటకాదులు నశించి పోవ డంతో తెగులు అనేది ఉండదు. ఫలితంగా లేబర్ ఛార్జీ తగ్గుతుంది. కొమ్మ అధిక సమయం ఫ్రెష్గా ఉంటుంది.

సాగు తీరుతెన్నుల గురించి తెలపండి?

మొక్కల మధ్య మూడు అడుగుల వ్యత్యాసం ఉండాలి. గాలి పారడంతో ఆకులు పండుబడకుండా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా తోట ఆరోగ్యవంతంగా ఉంటుంది. జిల్లాలో కడప, బద్వేల్, పులివెందుల, మైదుకూరు ప్రాంతాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగులో ఉంది.

పంట దశలను వివరించండి?

మూడు నెలల పాటు నారు సాగు చేయాల్సి ఉంటుంది. నాలుగున్నర నెలకు కోత దశకు చేరుకుంటుంది. ప్రతి 45 రోజులకోసారి పంట కోతకు వస్తుంది. ఈలెక్కన ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు తీసే అవకాశం ఉంది. దీంతో ఎకరా సాగుకు 250 నుంచి 300 గుళ్లు మేపవచ్చు. కోతకు రూ.90 వేల చొప్పున ఆరు కోతల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. ఈలెక్కన ఎకరానికి రూ.రెండు లక్షల నుంచి రూ. ఐదు లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

షేక్ హాజీ హసన్కు హజ్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలి

ప్రజాశక్తి-బద్వేల్ : టిడిపి కేంద్ర పార్టీ కార్యాలయ ఆహ్వాన కమిటీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ హాజీ హసన్కు హజ్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చి ఆయన పార్టీకి చేసిన సేవలకు గుర్తింపు దక్కేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవాలని తెలుగు యువత కడప పార్లమెంటు ఉపాధ్యక్షులు షేక్ జహంగీర్ బాషా కోరారు. ఆదివారం సిద్ధవటంరోడ్లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ షేక్ హాజీ హసన్ మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆహ్వాన కమిటీ చైర్మన్గా పనిచేస్తున్నారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు 26 జిల్లాల నుంచి పార్టీ కార్యాలయానికి వచ్చే టిడిపి నాయకులు, కార్యకర్తలతో మమేకమై అవసరమయ్యే అన్ని పనులను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తున్నారన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు

ప్రజాశక్తి కడప అర్బన్ : నేత్రదానం చేయడం ద్వారా అంధుల జీవితాల్లో వెలుగు నింపినట్లు అవుతుందని డిపిఎం డాక్టర్ సునీత అన్నారు. ఆదివారం నేత్రదాన పక్షోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పుష్పగిరి విట్రియో రెటీనా ఇన్స్టిట్యూట్ ఆఫ్ కడప, డిబిసిఎస్ సమన్వయంతో మహావీర సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు మౌన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ సునీత, యూనిట్ హెడ్ సూర్య ప్రకాష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేత్రదాన పక్షోత్సవాలు ఈనెల 8 వరకు ఉంటాయని తెలిపారు. నేత్రదానం చేయడం వల్ల కార్నియా అంధత్వంతో బాధపడే ఇద్దరు జీవితాలలో వెలుగులు నిండుతాయని ఉద్ఘాటించారు.

సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆదివారానికి 29 సంవత్సరాలు పూర్తి చూసుకున్న సందర్భంగా పట్టణంలోని టిడిపి నాయకులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు గాంధీ సర్కిల్‌లో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, సిద్ధారెడ్డి, ప్రేమసాగర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే రాష్ట్రాభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్ర నాథ్ రెడ్డి(బీటెక్ రవి) సతీమణి లతా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో సిఎం చంద్రబాబు మొట్ట మొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పుప్పాల శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - చాపాడు

పి.మునిశేఖర్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభు త్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పెన్షన్‌దారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టు కొని సెప్టెంబర్ నెలలో ఇవ్వవలసిన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ మొత్తాన్ని ఆగస్టు 31 శనివారం ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతో షించదగ్గ పరిణామమని పార్లమెంటు అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజల అవసరాలు, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజాపరిపాలన కొనసాగిస్తుందని చెప్పడానికి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీనే నిదర్శనమన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజల అవ సరాలు, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏనాడు ప్రజా పరిపాలన కొన సాగించలేదని విమర్శించారు. ప్రతినెల ఒకటో తేదీన ఇంటి దగ్గరకే వచ్చి ప్రభుత్వ అధికారులు పెన్షన్ ఇస్తారని ఇచ్చిన హామీ ప్రకారం అమలు చేస్తు న్నారని, లబ్ధిదారుల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబుకు మునిశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలు నాటుతున్న సిఐ లింగప్ప, నాగార్జున

ఆంధ్రను క్లీన్, గ్రీన్‌గా మారుద్దాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మొక్కలను నాటి, వాటిని పెంచి ఆంధ్ర రాష్ట్రాన్ని క్లీన్, గ్రీన్‌గా మారుద్దామని జనసేన జమ్మలమడుగు కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం, అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఆదివారం నిర్వహించిన వేడుకలు, సామాజిక కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటారు. నాగార్జున మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు లక్షలాదిగా మొక్కలు నాటే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా పవనకళ్యాణ్ అభిమానులు, జనసైనికులు చేస్తున్నారన్నారు. కోటి మొక్కలు నాటాలనే ఆయన ఆలోచనను ముందుకు తీసుకెళ్లడంలో జనసైనికులందరం భాగస్వామ్యమయ్యామన్నారు. ముఖ్య అతిధిగా సిఐ లింగప్ప మాట్లాడుతూ మంచి ఉద్దేశంతో చేసే పని భావితరాల వారికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కల్పన, జనసేన సీనియర్ నాయకులు వనం గురుకుమార్, పవన్‌కుమార్, మహబూబ్, కాటమరాయుడు, ఉదయ్‌కుమార్, వినయ్‌కుమార్, హుస్సేన్‌వల్లి, సుధాకర్, శుభాష్, జనసైనికులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - వేంపల్లె

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం వేంపల్లెలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి డాక్టర్ హరీష్ తెలిపారు. వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉదయం 8 గంటలకు కేక్ కట్ చేసి, అనంతరం తిరుమల థియేటర్ సమీపంలో రక్తదానం శిబిరంతోపాటు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పవన్‌కల్యాణ్ అభిమానులు, కార్యకర్తలు, అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

సంఘటనా స్థలంలో మృతదేహాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప-కర్నూల్ జాతీయ రహదారి పాటిమీదపల్లె టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మృతులు చింతకొమ్మదిన్నె మండలం పాత సాహెబ్ పేటకు చెందిన దినేష్‌రెడ్డి (19), వెంకటరమణ (24)గా గుర్తించారు. వీరు ప్రొద్దుటూరులో ద్విచక్ర వాహనం కొనగోలు చేయడంతో పాటు, వ్యక్తిగత పని ముగించుకొని కడప మీదుగా ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మండలంలోని టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా.. మరొకరు చికిత్స కోసం తరలిస్తుండగా మృతి చెందాడు. మతులిరువురు వివాహితులే. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరో యువకుడు..

ప్రజాశక్తి - వేముల

కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని భూమయ్యగారిపల్లి క్రాస్ వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని షేక్ రఫీ (33) మృతి చెందినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి వేల్పుల గ్రామం నుంచి రఫీ భూమయ్యగారిపల్లి క్రాస్ వరకు నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొందన్నారు. మృతుడు అన్న బాబావల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

చాపాడు : సిద్దారెడ్డిపల్లె ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఆదివారం మండల పరిధిలో అధిక వర్షపాతం నమోదైంది. గత నెలలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారి మురుగు నీరు నిల్వ ఉంది. మళ్లీ వర్షం పడటంతో నీరు నిలిచింది. నెర్రవాడ, మడూరు, సిద్ధారెడ్డిపల్లె, ఖాదర్‌పల్లె, సోమాపురం, గుంత చియ్యపాడు తదితర గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. వరి పంట సాగుతో ట్రాక్టర్లు అధికంగా తిరుగుతూ ఉండడం వల్ల రోడ్లన్నీ బురద మయంగా మారుతున్నాయి. నెర్రవాడలో ప్రభుత్వ పాఠశాల వద్ద, ప్రధాన రహదారిలో నీరు చేరుతోంది. ఎక్కువ గ్రామాల్లో ప్రభుత్వ భవనాల ఆవరణలో వర్షం నీరు నిలుస్తుంది. ఇప్పట్టికైనా అధికారులు స్పందించి వర్షం నీరు నిలువ లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైతులకు ఊరటనిస్తున్న వర్షం

కమలాపురం టౌన్ : రెండు రోజులుగా జిల్లాలో వర్షం కురుస్తుండడంతో మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కురిసిన వర్షాలకు సాగుచేసిన మినుము, పెసర, వరి, పత్తిని సాగుచేశారు. తరువాత మబ్బులే తప్ప వర్షాలు ముఖం చాటేయడంతో సాగు చేసిన పంటలు ఎండు దశకు చేరుకుంటున్నాయి. ఎంతో కష్టపడి అప్పు సొప్పు చేసి సాగు చేసిన పంటలు ఎండిపోతుండడంతో ఆందోళన చెందారు. దీంతో చాలా మంది ఆశలు వదులుకుని రైతులు వాటిని దున్నేశారు. అలాగే ఉంచుకున్న రైతుల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆనందాన్ని నింపాయి. పశుగ్రాసం సాగు చేసిన రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేలకొరిగిన విద్యుత్‌స్తంభం

కమలాపురం మండలం పందిళ్ళపల్లిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 11 కె.వి విద్యుత్ లైన్లు నేలకు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పొలంలో వ్యవసాయం చేసుకునే రైతులకు, అటువైపుగా వెళ్లే పాదచారులకు, గొర్రెల కాపరులకు మూగ జీవాలకు, ప్రమాదం వాటిల్లనుంది.

కమలాపురం : పొలాల్లో నిలిచిన వర్షపునీరు

ప్రభుత్వమే చీనీ పంటకు ఉచిత బీమా చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎండిపోతున్న చీనీ పంట

ఉమామహేశ్వరరెడ్డి, రైతు

రైతులు ఆరుగాలం కష్టించి సాగు చేసిన చీనీ పంటకు ప్రభుత్వమే ఉచిత బీమా చేసి రైతులను ఆదుకోవాలని మంగపట్నం కూటమి నాయకులు, రైతు ఉమామహేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చీనీ పంట సాగుకు ఎకరానికి దాదాపు రూ.50వేలు ఖర్చు అవుతుందన్నారు. చీనీ చెట్లు 30 ఏళ్లు ఉంటాయన్నారు. చెట్లు నాటిన 8ఏళ్ల నుండి ఏడాదికి ఒక పంట కాపు కాస్తుందన్నారు. అయితే చెట్లు నాటిన 1-8ఏళ్లకు వైరస్ సోకి చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు ఎండిపోవడంతో పంట చేతికి అందక అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు పడు తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తీవ్రంగా నష్ట పోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం చీనీ పంటకు ఉచి తంగా ఎకరాకు రూ.12వేలు బీమా చేసిందన్నారు. గత వైసిపి పాలనలో అమలు చేసిన విధానాన్ని టిడిపి ప్రభుత్వం కొత్తగా అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చీనీ పంటకు ఉచితంగా బీమా రూ.15వేలు చేసి రైతులను ఆదు కోవాలని గ్రామ రైతులు అంకం నాయుడు, మహేశ్వర్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి కోరారు. మండల వ్యాప్తంగా 4,500 ఎకరాల్లో చీనీ పంట సాగు చేసినట్లు ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం చీనీ పంటకు డాక్టర్ వైఎస్ఆర్ ఫ్రీ క్రాఫ్ట్ బీమా ద్వారా ఉచితంగా చీనీ పంటకు రూ.10-12వేలు బీమా చేసిం దన్నారు.

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సిఎం నెరవేర్చాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్.తులసిరెడ్డి

కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేక రులతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ మేరకు ప్రతి నెల మొదటి తేదీన ఇంటివద్దనే లబ్ధిదారులకు సామాజిక ఫించన్లు పంపిణీ చేయడం హర్షణీయమని తెలిపారు. మేనిఫెస్టోలో పేర్కొన్న మిగతా హామీల అమలుపై సిఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని కోరారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్ ఇస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 మాసాలు గడిచిపోయినా అమలు కాలేదని చెప్పారు. యువగళం కింద నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంత వరకు ఇవ్వలేదని విమర్శించారు. తల్లికి వందనం పథకం కింద పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థికసాయం చేస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుందని, ఇంత వరకు రైతులకు సాయం చేయలేదని అన్నారు. 19 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసున్న ప్రతి మహిళకు నెలకు రూ.1500, ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు సరఫరా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు కూడా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే మునగ చెట్టు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మునగ కాయలు (ఆకులు) రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా అనేక లాభా లున్నాయని పెద్దలు, నిపుణులు చెబు తున్నారు. బాలింతల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ అవసరమైన ఆరోగ్యాన్ని అందిస్తుంది. మునగ ఆకు, గింజలు కూడా పలు ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. మునగ ఆకులో రోజు శరీరానికి అవసరమయ్యే అమైనో ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని మన శరీరం స్వయంగా ఉత్పత్తి చేయలేదు. ఇవి ప్రోటీన్ సంశ్లేషణ, కండరాల అభివృద్ధి, న్యూరోట్రాన్స్మిటర్ పనితీరుకు ముఖ్యంకాగా పూర్తి శ్రేయస్సుకు దోహదం చేస్తాయి. మునగ కాయలు పాల ఉత్పత్తిని పెంచడం ద్వారా బాలింతలకు బాగా ఉపకరిస్తాయి. రక్తపోటు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించడం ద్వారా మధుమేహం అదుపులో ఉండేందుకు సాయ పడుతుంది. మున గాకు తినడం వల్ల కంటి చూపు కూడా మెరు గుపడుతుంది. ఆకుల్లో 10.74 శాతం నుంచి 30.29 శాతం వరకు ప్రోటీన్ ఉంటుంది. ఇది కండరాల పెరుగుదల, టిష్యూ రిపేర్‌కు ఎంతో ఉపయోగం. అంతేకాదు ఎంజైములు, హార్మోన్ల ఉత్పత్తికి ప్రోటీన్ అవసరం. ఆరోగ్య కరమైన చర్మం, రక్తం, రోగ నిరోధక వ్యవస్థల మెరుగైన పనితీరుకు సాయం చేస్తుంది. మున గాకులో ప్రొవిటమిన్ ఎ (బీటా కెరోటిన్) అధి కంగా ఉం టుంది. దీన్ని శరీరం విటమిన్ ఎగా మార్చు కుంటుంది. కాగా ఈ విటమిన్ ఆరోగ్య కరమైన దృష్టి, రోగనిరోధక పనితీరు, చర్మ ఆరో గ్యాన్ని మెరుగుపరుస్తుంది నిపుణులు తెలుపుతు న్నారు. ఇక వీటిలో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ రక్తపోటు, వాపు తగ్గిస్తూ గుండె ఆరో గ్యానికి మేలు చేస్తాయి. మునగాకు ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ కూడా అందిస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయి లను కంట్రోల్ చేస్తూ హార్ట్ హెల్త్, బ్రెయిన్ పని తీరుకు మద్దతిస్తాయి. పూర్వం పెద్దలు ఎక్కు వగా మునగాకు, మునగకాయలు తినడం వల్ల ఇప్ప టికీ కంటి చూపు బాగా కనిపించే వారున్నారు.

వర్షపు నీరు నివాసాల్లోకి వెళుతున్నా పట్టదా?

నీళ్లలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రోడ్ల మీద నిలిచివున్న వర్షపు నీరు నివాసాలలోకి వెళుతున్నా అధికారులు చూస్తూ ఉన్నారే కానీ పరిస్కార మార్గం చేయడం లేదని సిఐటియు నాయకులు దాసరి విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. మైలవరం మండల పరిధిలోని దొమ్మర నంద్యాల గ్రామంలో ఆదివారం అయ్యగారి వీధి మలుపు వద్ద చిన్నపాటి వర్షాలకు రోడ్లమీద నీళ్లు నిలబడి రోడ్లన్నీ జలమయం అవుతున్నాయన్నారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువ కురుస్తున్నందున సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. గతంలో ఉన్న సైడు కాలువలు పూడ్చడంతో వర్షపు నీరు ఎటూ పోయే ఆస్కారం లేక స్థానిక నివాసాల్లోకి పోతున్నాయన్నారు. సమస్యపైన గ్రామ పంచాయతీ సెక్రటరీకి అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చినా కూడా వారు స్పందించకపోవడం దేనికి నిదర్శనమో వారికే తెలియాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పట్ల స్పందించని పంచాయతీ సెక్రెటరీని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య ను కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవాలనే ఉద్దేశంతో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపామన్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో డి.వినయ్, పెద్దన్న, చరణ్, భరత్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గుడ్లవల్లేరు ఘటనపై సమగ్ర విచారణ చేయాలని, రేప్ కేసు నుంచి సజ్జన్ జిందాల్ నీ రక్షించడానికి ముంబై నటి జత్వానీ ఆమె కుటుంబాన్ని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో నిర్బంధించిన ఐపీఎస్‌లను సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, తులసీశ్వర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల హిడేన్ కెమెరాల ఘటనపై నిష్పక్షపాత విచారణ చేసి ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

సుందరయ్య నగర్ ప్రాంతం కోగటం రస్తాలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా.. విద్యుత్ సబ్‌స్టేషన్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక పురపాలిక పరిధిలోని సుందరయ్య నగర్ ప్రాంతం కోగటం రస్తాలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. ఇక్కడ 2019 ఎన్నికల ముందు సబ్‌స్టేషన్ నిర్మించారు. సబ్‌స్టేషన్‌లో ముఖ్యంగా రాత్రి సమయాల్లో బయటి వ్యక్తులు మద్యం సేవించడం, పేకాట ఆడుతున్నట్లు ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఆకతాయిలు పెద్ద ఎత్తున శబ్దాలు చేస్తూ ఉంటారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్‌కు వాచ్‌మెన్ సౌకర్యంలేదు. నిరంతరం విధుల్లో ఉండవలసిన సిబ్బంది కూడా తరచూ సబ్‌స్టేషన్ తలుపు మూసివేసి వెళ్లడం పరిపాటిగా మారింది. ఏవైనా ప్రమాదాలు సంభవిస్తే దిక్కులేకుండా పోతుందని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో మద్యం బాబుల చిందులకు ఇది వేదికగా మారిన నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

4న టెన్నికాయిట్ సబ్ జూనియర్ జట్లు ఎంపిక

- టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

టెన్నికాయిట్ 36వ సబ్ జూనియర్ జట్టు ఎంపికలను ఈనెల 4న నిర్వహిస్తున్నట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ఎంపికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. టెన్నికాయిట్ పోటీలో పాల్గొనే విద్యార్థులు 2010 ఏప్రిల్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 14 నుంచి 16 వరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో కడప జిల్లా తరుపున హాజరవుతారని వివరించారు. ఎంఇఒ స్టాలిన్, పాఠశాల హెచ్ఎం శివ మునెమ్మ, ఆర్గనైజేషన్ సెక్రటరీలు రాజశేఖర్, ఫ్రాన్సిస్ రవికుమార్, జయప్రద ఆధ్వర్యంలో జరుగుతాయని చెప్పారు. మరిన్ని వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ 94403 06203నంబర్‌ను సంప్రదించాలని రవికుమార్ కోరారు.

'పుట్టపర్తి'కి సంగీతం, సాహిత్యం రెండు కళ్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వేడుకలను నిర్వహిస్తున్న సాహితీప్రియులు

సరస్వతీపుత్ర డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులకు సంగీతం, సాహిత్యం రెండు కళ్లలాంటివని పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక అగస్తేశ్వరాలయంలో ఆదివారం పుట్టపర్తి 33వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణాచార్యులు 14భాషలను నేర్చుకున్నారన్నారు. విశ్వనాధవారి ఏకవీర నవలను మలయాళంలోకి అనువదించారన్నారు. హిందీలో తులసీదాస్ రామాయణాన్ని కంఠస్తం చేశారన్నారు. పీఠం ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సంగీత, సాహిత్య, నాట్య సంకేతాల కావ్యం శివతాండవం నారాయణాచార్యులు ప్రొద్దుటూరు అగస్తేశ్వరాలయంలో రచించడం మన అదృష్టమన్నారు. హృషికేశ్‌లో స్వామి శివానంద మహారాజు వారికి సరస్వతీపుత్ర బిరుదును ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వ్యాయామ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ రవిశంకర్,జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభుకుమార్, అంకాల్ కొండయ్య, సాయికుమార్, గంగాధర్, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఆర్థికసాయం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

మండలంలోని కసనూరు గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ బోనాల హరి కుటుంబ సభ్యులకు రూ.50,500 ఆర్థికసాయాన్ని ఆదివారం ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ తరపున అం దించారు. కసునూరు గ్రామానికి వెళ్లి మృతి చెందిన హరి భార్య ఉమాదేవి, కుమారుడు తనీష్, కుమార్తె ప్రణవికి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో హరి మృతి చెందిన విషయం తెలిసిందే. పులివెందుల ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్, అవుట్ డోర్ ఫొటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ ఫొటో కుటుంబ సభ్యులు కలిసి ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. హరి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్స్, అల్లా బకాష్, గంగా ప్రసాద్, సురేష్, శివరెడ్డి, భరత్‌కుమార్, శ్రీను, మారుతి, గోపాల్, బాషా, నబీరసుల్, నారాయణ, ఫొటోగ్రాఫర్స్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ అభినందనీయం

ప్రజాశక్తి - చక్రాయపేట

నోటు పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

నోటు పుస్తకాలు, అభ్యసన సామగ్రి పంపిణీ చేయడం అభినం దనీయమని ఎంఇఒ-2 రవికుమార్ పేర్కొన్నారు. టిడిపి కార్యకర్త రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మారెళ్ళమడక పాఠశాల విద్యార్థులకు బొజ్జా ధనమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త రఘునాథరెడ్డి అందజేశారు. ముఖ్యఅతిధిగా టిడిపి ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్య్రమంలో ఎపి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరికలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరరెడ్డి, ఉపాధ్యాయులు మల్లేశ్వరయ్య, నరసింహులు, రామసుబ్బయ్య, మనోహర, భోగేశ్వరయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు 'ఒంటేరు' ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రోత్సాహకాలను అందుకున్న క్రీడాకారులు

ఈనెల రెండవ వారం ఆగ్రాలో జరిగే తేక్వాండో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఉపాధ్యాయ సంఘాల గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ప్రయాణపు ఛార్జిలను అందించారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఆగ్రాలో జూనియర్, సబ్-జూనియర్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు జిల్లా నుండి ఏడు మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వారికి ఒంటేరు తన వంతుగా ఒకొక్క క్రీడాకారునికి రూ.2వేలు నగదు ప్రోత్సాహాన్ని తన కార్యాలయంలో అందించారు. ఫాతిమా, కళ్యాణ్, సాయికృష్ణతేజ, భరత్, ఖాసిం, మౌనిక, నదీష్‌లకు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయలు మాధవరెడ్డి, మధుసూధన్, గంగాధర్, అసోషి యేషన్ కార్యదర్శి నాయబ్ రసూల్, సలీం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.